పప్పన్నమూ కష్టమే

- రేషన్ దుకాణాల్లో బియ్యం మాత్రమే సరఫరా
- కందిపప్పు, పంచదార ఊసే లేదు
- బహిరంగ మార్కెట్‌లో ధరలకు రెక్కలు
- పేద, మధ్యతరగతి ప్రజలకు అవస్థలు

సీతమ్మధార : పేద, మధ్య తరగతి ప్రజలకు పండగ పూట పప్పన్నమూ కష్టమే అన్నట్లుగా ఉంది పరిస్థితి. బయటి మార్కెట్‌లో నిత్యావసర వస్తువుల ధరలు చుక్కలను అంటాయి. ఉప్పు నుంచి పప్పు వరకు ధరలు భారీగా పెరిగిపోయాయి. ధరలను అదుపు చేస్తామని, నిత్యావసర సరకులను రేషన్ డిపోల ద్వారా పంపిణీ చేస్తామని ప్రకటనలు గుప్పించిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీల అమలులో విఫలం కావడంతో ప్రజలపై భారం పెరిగిపోయింది. పరిస్థితి ఇలా ఉంటే ఏం కొంటాం.. ఏం తింటామంటూ వారంతా నిట్టూరుస్తున్నారు.

రేషన్ దుకాణాలను పటిష్టం చేస్తామని..

ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు రేషన్ దుకాణాలను పటిష్టం చేస్తామని ప్రకటించారు. తక్కువ ధరకే నిత్యావసర సరకులు అందిస్తామని హామీలు గుప్పించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు కావస్తున్నా ఆ దిశగా చర్యలు మాత్రం కానరావడం లేదు. రేషన్ దుకాణాల్లో ఏ సరకూ సక్రమంగా ఇస్తున్న దాఖలాలు కనిపించడం లేదు. అధికారంలోకి వస్తే తొలుత కందిపప్పును రాయితీపై అందిస్తామని చంద్రబాబు ప్రకటించారు. దశల వారీగా పామాయిల్, గోధుమ పిండి తదితర సరకులు పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు. అయితే ఇప్పటి వరకు వంట నూనె, గోధుమ పిండి పంపిణీని పక్కన పెడితే కందిపప్పును అరకొరగా అందిస్తూ చేతులు దులిపేసుకుంటున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ధరలు పెరిగినప్పుడు పేదలకు సాంత్వన చేకూర్చేందుకు రైతు బజార్లు, రేషన్ డిపోలలో రాయితీపై వంటనూనె, కందిపప్పు, శనగపప్పు పంపిణీ చేసేవారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ధరలు పెరిగినపుడు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా కిలో కంది పప్పును రూ.67కే అందించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో ఇటువంటి చర్యలు కనిపించడం లేదని ప్రజలు నిట్టూరుస్తున్నారు.



రేషన్ సరకుల పంపిణీ వాహనం వద్ద నిరీక్షిస్తున్న కార్డుదారులు

మూడు నెలలుగా ఇదే తీరు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆగస్టు, సెప్టెంబర్‌లో కార్డుదారులకు పంచదార ఇవ్వనేలేదు. ఈ నెల అరకొరగా కందిపప్పు ఇస్తున్నారు. గత నెలలో వినాయక చవితి పండగ ఉందని తెలిసి కూడా పౌరసరఫరాల శాఖ పూర్తిస్థాయిలో పంచదార ఇవ్వకపోవడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు మూడో నెల కూడా రేషన్ డిపోల ద్వారా కందిపప్పు పూర్తి స్థాయిలో ఇవ్వకపోవడం గమనార్హం. పౌర సరఫరాల శాఖ సర్కిల్ – 2 పరిధిలో గల తూర్పు, ఉత్తర నియోజకవర్గాల్లో 152 రేషన్ డిపోలున్నాయి. కానీ 12.7 టన్నుల కందిపప్పు మాత్రమే రావడంతో కార్డుదారులకు కష్టాలు తీరడం లేదు. ఈ డిపోల పరిధిలో గల 1.53 లక్షల మంది కార్డుదారులకు 78 వాహనాల ద్వారా సరకులు పంపిణీ చేస్తున్నారు. అయితే ఒక్కో డిపోకు 100 కిలోల కందిపప్పు మాత్రమే ఇవ్వడంతో అది కొద్దిసేపటిలోనే అయిపోతోంది. ప్రతీ నెలా కార్డుదారులకు కేంద్ర ప్రభుత్వం ద్వారా వస్తున్న ఉచిత బియ్యంతో సరిపెట్టేస్తున్నారు. గత నెల సర్కిల్ – 2 పరిధిలో రైస్‌కార్డుదారులకు 200 కిలోల పంచదార మాత్రమే ఇవ్వడంతో పలు డిపోలకు అసలు అందనేలేదు. కందిపప్పు కిలో బహిరంగ మార్కెట్‌లో రూ.190 వుండగా, సూపర్‌బజార్‌లో రూ.185కి,



రైతుబజార్లలో రూ.150కి విక్రయిస్తున్నారు. రేషన్ డిపోలో రూ.67కే ఇవ్వడంతో డిమాండ్ అధికంగా ఉంటుంది. ఈ నెలలో దసరాతోపాటు దీపావళి పండగలున్నా ప్రభుత్వం స్పందించకపోవడంతో సంక్రాంతి కానుకల సరఫరా లేనట్టేనని కార్డుదారులు ఆందోళన చెందుతున్నారు.

సరకులు అందడం లేదు

కూటమి ప్రభుత్వం వచ్చాక రేషన్ సరకులు పూర్తి స్థాయిలో అందడం లేదు. గత ప్రభుత్వ హయాంలో డిపోల ద్వారా బియ్యంతోపాటు కందిపప్పు, పంచదార ఇచ్చేవారు. గత నెల పంచదార ఇవ్వనేలేదు. ఈ నెలలో కొన్ని డిపోలకు మాత్రమే పంచదార వచ్చిందని చెబుతున్నారు. వినాయక చవితి సమయంలోనూ పంచదార ఇవ్వకపోవడం దారుణం.

– డి.లలిత, సీతమ్మధార

బియ్యంతో సరిపెట్టేస్తున్నారు

కృష్ణాష్టమి వినాయక చవితి, నవరాత్రి ఉత్సవాలు జరుగుతున్నా రేషన్ డిపోల్లో పంచదార పంపిణీ చేయడం లేదు. ఏ డిపోలోనూ పూర్తి స్థాయిలో కార్డుదారులకు పంచదార ఇవ్వలేదు. ఇచ్చేదే అర కిలో పంచదార. అదికూడా పూర్తిస్థాయిలో ఇవ్వకపోవడం విడ్డూరంగా వుంది. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న ఉచిత బియ్యంతోనే సరిపెట్టేస్తున్నారు.

– బి.రాధ రెడ్డి, గురుద్వారా

కందిపప్పు ఇవ్వకపోవడం దారుణం

ఈ నెలలో దసరాతోపాటు దీపావళి పండగ ఉంది. ఒకే నెలలో రెండు పండగలున్నా కార్డుదారులకు కందిపప్పు ఇవ్వకపోవడం దారుణం. ఇప్పటికే రెండు నెలలుగా కందిపప్పు ఇవ్వడం లేదు. ఇప్పుడేమో ఒక్కో డిపోకి కేవలం వంద కిలోలు మాత్రమే ఇవ్వడంతో అది ఒక్క పూటలోనే అయిపోయిందని డీలర్లు అంటున్నారు. కూటమి ప్రభుత్వం రేషన్ డిపోలను నిర్వీర్యం చేస్తోంది.

– అన్నపూర్ణ, రేసపువానిపాలెం

రేషన్ డిపోలు నిర్వీర్యం

కూటమి ప్రభుత్వం వచ్చాక రేషన్‌డిపోలు పటిష్టం చేస్తామని నిర్వీర్యం చేస్తున్నారు. కానీ రెండు నెలలుగా కందిపప్పు పూర్తిగా ఇవ్వడం మానేశారు. గత నెలలో పంచదార పూర్తి స్థాయిలో ఇవ్వలేదు. ఈ నెలలో రెండు పండగలు దసరా, దీపావళి వున్నా ఒక్కో డిపోకి వంద కిలోల కందిపప్పు మాత్రమే ఇవ్వడం అన్యాయం. బహిరంగ మార్కెట్‌లో కందిపప్పు ధరలు మండిపోతున్నాయి.

– రాజ్యలక్ష్మి, సీతమ్మధార

కొనేదెలా..? తినేదెలా..?

కూటమి ప్రభుత్వంలో 30 శాతం పెరిగిన నిత్యావసర సరకుల ధరలు

సీతంపేట : దసరా పండగ ముందు నిత్యావసర సరకుల ధరలు ఒక్కసారిగా ఆకాశాన్నంటాయి. పండక్కి అవసరమైన సరకులు కొందామంటే బియ్యం, పప్పులు, నూనె, చింతపండు, ఎండుమిర్చి ధరలు కొండెక్కి కూర్చున్నాయి. మరోవైపు కూరగాయల ధరలు చూస్తుంటే కొనకుండానే కన్నీరు తెప్పిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలనలో నిత్యావసర వస్తువుల ధరలు 20 నుంచి 30 శాతం పెరిగాయి. ధరల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడంతో పేద, మధ్య తరగతి ప్రజలపై నెలవారీ ఆర్థిక భారం పడుతోందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెల కిందట రూ.90 ఉండే పామాయిల్ రూ.125, రిఫండాయిల్ రూ.112 నుంచి రూ.138కి పెరిగింది. కంది పప్పు రూ.150 నుంచి రూ.190, ఎండు మిర్చి రూ.280 నుంచి రూ.340, చింతపండు రూ.100 నుంచి రూ.140, రైస్ బ్యాగ్ (26 కిలోలు) రూ.1300 నుంచి రూ.1450కి, శనగపప్పు రూ.120 నుంచి రూ.130కి, కాఫీపొడి అర కిలో రూ.250 నుంచి రూ.350కి, టీ పొడి అర కిలో రూ.200 నుంచి రూ.235కి ఎగబాకాయి. దీనికితోడు ఉల్లి, టమాటా, అల్లం, పచ్చిమిర్చి, వెల్లుల్లి ధరలు అమాతంగా పెరిగాయి. రైతుబజార్‌లో కిలో రూ.15 నుంచి రూ.20కి లభించే కూరగాయలు ప్రస్తుతం రూ.50 నుంచి రూ.60కి చేరాయి. రైతు బజార్‌లో ఏ కూర కొందామన్నా కిలో రూ.50కి తక్కువకు దొరకడం లేదు. ఇక బహిరంగ మార్కెట్‌లో కూరగాయలు కిలో రూ.70 పైమాటే. ఆఖరికి ఆకు కూరల ధరలు సైతం ఆకాశాన్నంటాయి. రూ.5లకు దొరికే చిన్న కొత్తిమీర రూ.20లకు, రూ.20లకు దొరికే పెద్ద కట్ట 50కి చేరింది. రూ.10కి మూడు కట్టలు ఇచ్చే తోటకూర, గోంగూర, చుక్క కూర, పాల కూర ఇపుడు ఒక్కటే ఇస్తున్నారు. పెరిగిన ధరలతో పండగ ఎలా చేసుకోవాలని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సూపర్ సిక్స్ పథకాల మాట దేవుడెరుగు..., ధరలు తగ్గించి పుణ్యం కట్టుకోవాలని జనం వేడుకుంటున్నారు.


రైతుబజార్‌లో కూరగాయల విక్రయాలు

సంచి నిండడం లేదు



వారం వారం రైతుబజార్‌కు వస్తుంటాను. వారానికి సరిపడా కూరలు కొంటాను. గతంలో రూ.300కే సంచి నిండేది. ఇపుడు రూ.500 పెట్టినా సంచి నిండడం లేదు. ఉల్లి, టమాట, అల్లం, వెల్లుల్లి, క్యారెట్, బీట్‌రూట్, చిక్కుడు, వంకాయలు అన్నీ సగానికి సగం రేట్లు పెరిగాయి. పెరిగిన ధరలతో ఏం కొనాలో... ఏం తినాలో తెలియడం లేదు.

– బి.మంగమ్మ, అక్కయ్యపాలెం

ధరలు నియంత్రించాలి



నెల కిందట లీటరు రిఫండా యిలు రూ.102 ఉండేది. ఇపు డు రూ.140 అయ్యింది. కంది పప్పు, పెసర పప్పు, మినప పప్పు, చింతపండు, మిరపకాయలు ఇలా ఒకటేమిటి ఇంట్లో వంటకు వాడే నిత్యావసర సరకులు అన్నీ ధరలు పెరిగాయి. సామాన్య, మధ్య తరగతి ప్రజలకు పెరిగిన ధరలు భారంగా ఉన్నాయి. ప్రభుత్వం చొరవ తీసుకుని ధరలు నియంత్రించాలి.

– కె.దేవి, గణేష్‌నగర్

సబ్సిడీపై విక్రయించాలి



దసరా పండగ సమీపిస్తోంది. పండగ వేళ ఏం కొందామన్నా ధరలు కొండెక్కి కూర్చున్నాయి. ఇటు నిత్యావసర సరకుల సరకులు, అటు కూరగాయల ధరలు అమాంతంగా పెరిగాయి. ఏమైనా అంటే వరదలు, వర్షాలు కారణమంటున్నారు. పెరిగిన ధరలతో ఇంటి ఖర్చు 20 నుంచి 30 శాతం పెరిగింది. ప్రభుత్వం సబ్సిడీపై నిత్యావసర వస్తువులు, ఉల్లి, టమాట విక్రయించాలి.

– నూకరత్నం, నరసింహనగర్

స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలి

సీతంపేట : విశాఖ ఉక్కు కర్మాగారాన్ని నిర్వీర్యం చేసి ప్రైవేటుపరం చేయాలని కూటమి ప్రభుత్వం చూస్తోందని ఇస్కఫ్ కన్వీనర్ దేవరకొండ మార్కండేయులు ఆరోపించారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో బుధవారం ఇస్కఫ్ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించి, సొంత గనులు, క్యాపిటల్ నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంస్థ ప్రతినిధులు శ్యాంసుందర్, అప్పలరాజు, టి.ఎస్.సుకుమారన్, ఇమంది పైడిరాజు, సత్యనారాయణ, సూర్యకుమారి, మధుమతి, లక్ష్మీపతి, కృష్ణబాబు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఇస్కఫ్ కన్వీనర్ దేవరకొండ మార్కండేయులు

డైలాగ్ అండ్ డెమోక్రసీ పుస్తకావిష్కరణ



పుస్తకం ఆవిష్కరిస్తున్న డాక్టర్ ఈఏఎస్ శర్మ, తదితరులు

సీతంపేట : సెంటర్ ఫర్ పాలసీ స్టడీస్ అధ్యక్షుడు ఆచార్య ఎ.ప్రసన్నకుమార్ రచించిన డైలాగ్ అండ్ డెమోక్రసీ 5వ సంపుటి ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో బుధవారం ఆవిష్కరించారు. ఫోరం ఫర్ బెటర్ విశాఖ అధ్యక్షుడు డాక్టర్ ఇ.ఎ.ఎస్.శర్మ ముఖ్య అతిథిగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డెమోక్రసీ అనేది అమెరికన్ కానిస్టిట్యూషన్ నుంచి తీసుకున్నామని, డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ పలు దేశాల రాజ్యాంగాల నుంచి అనేక విషయాలు సంగ్రహించి ముసాయిదా తయారు చేశారన్నారు. దేశంలో అందరికీ సమాన హక్కులు కల్పించేలా రాజ్యాంగం రూపొందించారని గుర్తు చేశారు. యువతరం ప్రశ్నించే తత్వం అలవాటు చేసకోవాలన్నారు. కార్యక్రమంలో పౌర గ్రంథాలయం సొసైటీ కార్యదర్శి డీఎస్.వర్మ, సాహితీవేత్తలు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దుర్గమ్మ మండపంలో రూ.75 వేల చోరీ


నగదుతో అలంకరించిన దుర్గాదేవి అమ్మవారు (ఫైల్)

సీతమ్మధార : దుర్గాదేవి మండపంలో నగదు చోరీ ఘటనపై నాలుగో పట్టణ క్రైం పోలీసులు కేసు నమోదు చేశారు. రైల్వే న్యూ కాలనీలో పరదేశమ్మ ఆలయానికి వెళ్లే దారిలో స్థానికులు దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా దుర్గాదేవి అమ్మవారి విగ్రహాన్ని రూ.75 వేల విలువ గల కరెన్సీ నోట్ల దండతో అలంకరించారు. మంగళవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు ఆ కరెన్సీ నోట్ల దండను అపహరించుకుపోయారు. నిర్వాహకులు గమనించి నాలుగో పట్టణ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు సీసీ కెమెరా ఫుటేజీ పరిశీలించారు. ఇన్‌ఛార్జి క్రైం ఎస్‌ఐ సునీల్ పర్యవేక్షణలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సబ్సిడీ టమాటా బ్లాక్‌లో విక్రయిస్తే చర్యలు

మార్కెటింగ్ శాఖ డీడీ శ్రీనివాస్ కిరణ్


టమాటా విక్రయాలపై సిబ్బందితో మాట్లాడుతున్న మార్కెటింగ్ శాఖ డీడీ శ్రీనివాస కిరణ్


టమాటా కోసం క్యూలో నిరీక్షిస్తున్న వినియోగదారులు

సీతమ్మధార: ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ టమాటా వినియోగదారులకు సక్రమంగా అందేలా చూడాలని జిల్లా వ్యవసాయ వాణిజ్య మార్కెటింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్ కిరణ్ ఆదేశించారు. బుధవారం ఆయన సీతమ్మధార రైతుబజార్‌ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సబ్సిడీపై టమాటా విక్రయిస్తున్న కౌంటర్లను పరిశీలించి సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వం టమాటాని సబ్సిడీపై కిలో రూ.50కే అందజేస్తుందన్నారు. రైతుబజార్లలో అందిస్తున్న సబ్సిడీ టమాటాని బ్లాక్ మార్కెట్‌లో ఎవరైనా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలోని అన్ని రైతుబజార్లలో వినియోగదారులకు సరిపడా టమాటా సరఫరా చేస్తున్నామన్నారు. ఆధార్ కార్డు లేదా రైస్ కార్డు మీద కుటుంబానికి రెండు కిలోలు విక్రయిస్తున్నామని తెలిపారు. అనంతరం ఆయన ప్రభుత్వం సరఫరా చేస్తున్న కందిపప్పు, బియ్యం ప్రత్యేక కౌంటర్‌ని పరిశీలించారు. ఆయనవెంట అల్లూరి సీతారామరాజు జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి రాకేష్, రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబు, సహాయకుడు సతీష్ ఉన్నారు.

పోర్టు ఆస్పత్రి పీపీపీ బిడ్స్ రద్దుకు డిమాండ్

తాటిచెట్లపాలెం: పోర్టు హాస్పిటల్‌ను పీపీపీకి ఇచ్చేందుకు ప్రతిపాదించిన బిడ్స్ ప్రక్రియను వెంటనే రద్దు చేయాలని, ఆస్పత్రిని పోర్టు అథారిటీ సొంతంగా నిర్వహించాలని సీఐటీయూ పబ్లిక్ సెక్టార్ కో ఆర్డినేషన్ కమిటీ కో కన్వీనర్ కుమార్ మంగళం డిమాండ్ చేశారు. పోర్టు ఆస్పత్రి వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 9వ రోజుకు చేరాయి. ఈ దీక్షల్లో పాల్గొన్న కుమార్ మంగళం మట్లాడుతూ పోర్టు హాస్పిటల్‌ను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడితే చూస్తూ ఊరకునేది లేదని హెచ్చరించారు. లాభాల్లో నడుస్తున్న ప్రభుత్వం రంగ సంస్థలను నిర్వీర్యం చేసి కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. కోట్ల రూపాయల లాభాలు ఆర్జిస్తున్న పోర్టు సొంతంగా ఆస్పత్రిని నిర్వహించాలని కోరారు. తమ పోరాటాలకు ఇప్పటికే జిల్లాలో ఉన్న కార్మిక, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు మద్దతిస్తున్నాయని తెలిపారు. బి.జగన్, నాయుడు, ఈశ్వరరావు, శ్రీను, శంకరరావు, స్వతంత్రకుమార్, సత్యనారాయణ పాల్గొన్నారు.

సరస్వతీ నమస్తుభ్యమ్

వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు


సరస్వతీ దేవి పూజలో చిన్నారులు

సీతంపేట : దుర్గా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజు బుధవారం అక్కయ్యపాలెం శ్రీలలితాపీఠంలో సరస్వతిపూజ, సరస్వతి హోమం, రాజశ్యామల హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా లలితా అమ్మవారిని బంగారు ఆభరణాలు, పట్టు చీర, పూలమాలలతో సర్వాంగసుందరంగా అలంకరించారు. విద్యార్థులు సరస్వతి దేవి పూజ చేశారు. సాయంత్రం పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని లలితా అమ్మవారికి సామూహిక లలితా సహస్రనామ కుంకుమార్చన చేశారు. గురువారం కాళీ మన్యు పాశుపత హోమం నిర్వహిస్తామని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు.

స్థానిక సీతంపేట పార్వతీశ్వరాలయంలో పార్వతీ దేవి బుధవారం సరస్వతిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పలువురు విద్యార్థులు సరస్వతిదేవి పూజ చేశారు. అమ్మవారి శ్రీచక్ర మేరువులకు మహిళలు సామూహిక కుంకుమ పూజలు, లలితా సహస్రనామార్చన, ఖడ్గమాలార్చన జరిపారు. ఆలయ అర్చకులు శివాజీ శర్మ, భాస్కర శర్మ పూజలు చేశారు.

సీతమ్మధార : నార్త్ ఎక్స్‌టెన్షన్‌లో గల శ్రీ మహాగణపతి ప్రసన్న వేంకటేశ్వరస్వామి, అయ్యప్ప స్వామి, శ్రీ షిరిడీసాయి బాబా దేవస్థానంలో బుధవారం సరస్వతీదేవి పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో చిన్నారులు తల్లిదండ్రులతో పాల్గొని పూజలు చేశారు. అర్చకుడు రాజాస్వామి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్, సిబ్బంది, పాల్గొన్నారు.


సరస్వతీదేవిగా భూలోకమాత


సరస్వతిదేవిగా పార్వతీ దేవి

సరస్వతీ దేవి అలంకారంలో భూలోకమాత

సీతమ్మధార : జీవీఎంసీ 24వ వార్డు రేసపువానిపాలెంలో గల శ్రీ భూలోకమాత అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. రేసపువానిపాలెం గ్రామ సేవా సంఘం ఆధ్వర్యంలో అమ్మవారు బుధవారం అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. రోజూ అమ్మవారికి పంచామృతాభిషేకం, దివ్య అలంకారం, హోమం, కుంకుమ పూజలు నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు.

గాంధీనగర్‌లో దుర్గాదేవి ఉత్సవాలు

కంచరపాలెం : జీవీఎంసీ 55వ వార్డు కంచరపాలెం పరిధి రామ్మూర్తిపంతులు పేట రైల్వే గేటు మార్గం నేతాజీ ఫ్లై ఓవర్ వంతెన వద్ద గల గాంధీనగర్‌లో కుమ్మరి – మేదర అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న దుర్గాదేవి ఉత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సంఘం సభ్యులు ఏర్పాటు చేసిన పంచమి రాత్రి ఉత్సవాల్లో సంఘం నిర్వాహకుడు దేవారపు రవి దంపతులు కలశ ప్రతిష్ట చేసి దుర్గమ్మకి తొలిపూజ చేశారు. ఆనంతరం మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. అసోసియేషన్ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. 10న శుక్రవారం దీపారాధన, 14న సోమవారం భారీ అన్నసమారాధన చేయనున్నట్లు నిర్వాహకుడు దేవారపు రవి తెలిపారు.


గాంధీనగర్‌లో ఏర్పాటు చేసిన దుర్గాదేవి అమ్మవారు

వైభవంగా సామూహిక కుంకుమార్చన


కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

సీతమ్మధార : దేవి శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఏపీఎస్‌ఈబీ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. వేద పండితులు విశ్వనాథశర్మ ఆధ్వర్యంలో 300 మందికి పైగా మహిళలు కుంకుమార్చాన చేశారు. అసోసియేషన్ చైర్మన్ జి.ఎస్.ఆర్.ప్రసాద్, గౌరవ చైర్మన్ ఎం.సింహాద్రిరాజు, సభ్యులు సి.సుజని, కె.సావిత్రి, జి.మంజులరాణి పాల్గొన్నారు.

రోడ్లపైనే భవన నిర్మాణ సామగ్రి


దుర్గానగర్‌లో స్థానికుల రాకపోకలకు వీలులేకుండా రహదారిపై వేసిన నిర్మాణ సామగ్రి

- ప్రమాదాలకు గురవుతున్న ద్విచక్ర వాహనదారులు, పాదచారులు
- పట్టించుకోని టౌన్ ప్లానింగ్, సచివాలయ అధికారులు

కంచరపాలెం : జీవీఎంసీ 54,56 వార్డుల పరిధిలోని పలు ప్రాంతాల్లో రహదారికి అడ్డంగా భవన నిర్మాణ సామగ్రి వేస్తుండడంతో రాకపోకలకు ద్విచక్ర వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కంచరపాలెం పరిధి దుర్గానగర్, 104 ఏరియా బాపూజీనగర్ వివేకానంద వీధి, గొల్లకంచరపాలెం, తోటవీధి, గౌరీనగర్, సుభాష్‌నగర్, తదితర ప్రాంతాలకు వెళ్లే రోడ్లలో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తోంది. ఈ ప్రాంతాల్లో కొంత మంది వ్యక్తులు భవనాలు నిర్మిస్తుండడం... జోన్ – 5 టౌన్‌ప్లానింగ్, సచివాలయ అధికారుల పర్యవేక్షణ లోపంతో బిల్డర్లు నిర్లక్ష్యంగా పనులు చేస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో ఇసుక, పిక్క, ఇటుకలు రోడ్ల మీద ఇష్టానుసారంగా వేస్తున్నారు. అడిగే వారు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పాదచారులు, ద్విచక్ర వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అటుగా ప్రయాణం చేసే ద్విచక్ర వాహనదారులు పలుమార్లు జారిపడుతున్నారు. ఇదేమిటని ఎవరైనా ప్రశ్నిస్తే భవన నిర్మాణ యజమానులు, కాంట్రాక్టర్లు, బిల్డర్లు ఘర్షణకు దిగుతున్నారు. జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బందితో మాట్లాడుకున్నామని దురుసుగా సమాధానమిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. ఇదే విషయంపై సచివాలయ టౌన్‌ప్లానింగ్ కార్యదర్శులకు ఫిర్యాదు చేస్తే నోటీసులు ఇస్తామని సున్నితంగా సమాధానమిస్తూ సరిపెట్టేస్తున్నారు. గత ప్రభుత్వంలో సమస్యలపై ఫిర్యాదులు చేస్తే తక్షణ చర్యలు ఉండేవని, కూటమి ప్రభుత్వంలో అధికారులు, సిబ్బంది మరింత నిర్లక్ష్యంగా పనిచేస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు.


104 ఏరియా బాపూజీనగర్‌లో రాకపోకలకు మార్గం లేకుండా రోడ్డుపై కాంక్రీటు

ముగ్గురు అమ్మవార్ల సింహద్వారం ప్రారంభం


సింహద్వారం ప్రారంభిస్తున్న ఎంపీ భరత్

సీతంపేట : శ్రీగౌరీ సేవా సంఘం (అక్కయ్యపాలెం) ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన ముగ్గురు అమ్మవార్ల సింహద్వారం బుధవారం ప్రారంభించారు. ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు కుమార్తె శ్యామల దీపిక, 44వ వార్డు కార్పొరేటర్ బాణాల శ్రీనివాసరావు కలిసి సింహద్వారం ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షుడు గండి బాబ్జి, గౌరీ సేవా సంఘం అధ్యక్షుడు కొయిలాడ వేణుగోపాల్, కార్పొరేటర్లు ఆళ్ల లీలావతి, పెద్దిశెట్టి ఉషశ్రీ, కేంద్ర గౌరీ సేవా సంఘం అధ్యక్షుడు బుద్ధ శివాజీ, సంఘం ప్రతినిధులు రాజగిరి సింహాచలం, రాజగిరి అప్పలరాజు, మల్లా త్రినాథరావు, పిల్లా ఫకీరునాయుడు, ఆడారి పారుపల్లి రవి పాల్గొన్నారు.

3.2 కిలోల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం : విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో గంజాయి అక్రమంగా తరలిస్తున్న నిందితుడిని రైల్వే పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. ఆర్పీఎఫ్ ఏఎస్‌ఐ శివనారాయణ సిబ్బందితో కలిసి రైల్వే స్టేషన్‌లో బుధవారం తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మధురై జిల్లాకు చెందిన పుకాజహేంతి కాలిముత్తు విశాఖ మీదుగా చెన్నైకు అక్రమంగా గంజాయి తరలిస్తున్నట్లు గుర్తించారు. అతని నుంచి 3.2 కేజీల గంజాయి స్వాధీనం చేసుకుని, గవర్నమెంట్ రైల్వే పోలీస్‌లకు అప్పగించారు. జీఆర్పీ ఎస్‌ఐ ఎస్‌కే అబ్దుల్‌మారూఫ్ కేసు నమోదు చేసి రిమాండు నిమిత్తం కోర్టులో హాజరుపరిచారు.

ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

సీతమ్మధార : ఐదుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేశామని ద్వారకా స్టేషన్ పోలీసులు తెలిపారు. స్టేషన్ పరిధిలోని గురుద్వారా సమీపంలో పల్లవి అపార్ట్‌మెంట్ పైభాగంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్ చేసి రూ.1.07 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. సీఐ డి.వెంకటరమణ పర్యవేక్షణలో ఎస్‌ఐ శ్రీను కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రేసపువానిపాలెం యూపీహెచ్‌సీ పరిశీలన

మహారాణిపేట : రేసపువానిపాలెంలోని అర్బన్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు బుధవారం సందర్శించారు. అనంతరం సమీపంలోని హరిజన వీధి సచివాలయాన్ని సందర్శించారు. అక్కడ లబ్ధిదారులు, సిబ్బందితో పలు విషయాలపై చర్చించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష చేశారు. అర్హులందరికీ అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ వేయాలని సూచించారు.


సచివాలయంలో మాట్లాడుతున్న జగదీశ్వరరావు